

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 8 సంచిక : 14 పుష్పం : 37-39 5-4-2003

RAMANA BHASKARA

TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE

PAGES : 16

VOL : 8 ISSUE : 14

EDITOR
P.S. RAMA RAJU

EDITING
P.H.V. SATYAVATHI
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
RAMANA BHASKARA
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI
MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 224589, 224689

PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 222438, 221260


## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 09-03-2003, పాలకొల్లు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మనకు శాంతిగాని, శక్తిగాని, జ్ఞానంగాని అంతా లోపలనుండే వస్తుంది, కాని ఇవి అన్నీ బయటనుండి వస్తున్నాయి అని మనం అనుకొంటున్నాము. బయటనుండి ఏమీరాదు. వికాశం కూడా లోపలనుండే వస్తుంది. మన భారతీయ సంస్కృతిలో తపస్సు గురించి ప్రధానంగా చెప్పారు. తపస్సు అంటే వ్యక్తిభావనను తపింపచేయటమే తపస్సు. తపస్సు లేని విద్య రాణించదు. పుస్తకజ్ఞానం కంటే తపస్సు ముఖ్యం. తపస్సు వలన మనస్సు సంస్కరింపబడుతుంది. మన హృదయంలోఉన్న సత్యాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి మన శరీరము, మనస్సు, ఇంద్రియాలు కండిషన్‌లో ఉండాలి. మనోదేహములు మన స్వాధీనములో లేనప్పడు మనంఎంతకాలం జీవించినా ఏమీ ప్రయోజనంలేదు. మనం కాలాన్ని పాడుచేసుకొంటున్నాము. కాలాన్ని పాడుచేసుకోవద్దు. కాలాన్ని సద్వినియోగం చేసుకొంటే భౌతికసంపద, ఆధ్యాత్మికసంపద కలుగుతుంది. మహ్మద్‌ప్రవక్త ఏమిచెప్పారు అంటే నా అనుయాయులలో ధనవంతులు ఉన్నారు, పేదవారు ఉన్నారు. నేను పేదవారి గురించి ఎక్కువ ఆలోచించటంలేదు, గాని ధనవంతుల గురించి ఎక్కువ ఆలోచిస్తున్నాను అని ప్రవక్తచెప్పారు. అక్కడ ఉన్నవారికి ఆయన చెప్పిన మాటలు అర్థంకాలేదు. పేదవారికి భోగం అనుభవించాలన్నా అవకాశాలు ఉండవు. ధనవంతులకు భోగాలు అనుభవించటానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ధనం మంచిదేకాని ధనంచూసుకొని భోగప్రవృత్తి పెంచుకొని జీవితం అంతా భోగమయం చేసుకొంటే వారు లోపలఉన్న స్వరూపానికి దూరమవుతారు, అంటే భగవంతునికి దూరమవుతారు. అందువలన పేదవారికంటే ధనవంతులగురించి ఎక్కువ ఆలోచిస్తున్నాను అని ప్రవక్త చెప్పారు. ధనం, విద్య, అధికారం, వీటిని నిగ్రహించుకోవటం చాలాకష్టం, వీటిని నిగ్రహించుకొంటే అవి మనకు సహకరిస్తాయి. దేశభక్తి మంచిదే దేశభక్తి వలన హృదయం విశాలమవుతుంది, దేశభక్తి దైవభక్తికి దారిచూపిస్తుంది. మనంపని, పనికోసమే చెయ్యాలి అంతేగాని ఏదో ఆశించిచేస్తే బంధింపబడుతాము. భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములను జాగ్రత్తగా ఉపయోగించుకొని భగవదనుభవం పొందాలి. మనకు వచ్చే తలంపుల విషయంలో, మనం మాట్లాడే మాటల విషయంలో జాగ్రత్తగా ఉండాలి, అజాగ్రత్త పనికిరాదు. కాలాన్ని ప్రతీక్షణం మనం సద్వినియోగం చేసుకొంటే కాలాతీతస్థితికి వెడతాము, కోరిక లేకుండా పనిచేస్తూఉంటే కోరికలకు అతీతమైన స్థితికి వెడతాము. ఎవడైతే కాలాతీతస్థితిని పొందాడో వాడు పరబ్రహ్మస్వరూపాన్ని పొందుతాడు. ఈప్రపంచం దేని కారణం వలన వచ్చింది అని అడుగుతారు. నువ్వు ఎక్కడనుంచి వచ్చావో, నీమూలకారణం ఏమిటో నీకు తెలిస్తే ప్రపంచం దేనికారణం వలన వచ్చిందో నీకు తెలుస్తుంది. నిన్ను నియమించేవాడు నీకు అర్థమయితే ప్రపంచాన్ని ఎవడు నియమిస్తున్నాడో వాడుకూడా నీకు అర్థమవుతాడు. సత్యం అనేదిఎప్పడూ ఒకటిగానే ఉంటుంది. దానిని అనేకమంది అనేక పేర్లతో చెపుతారు. ఉన్నది ఒక్కటే వస్తువు అదిమనలోపల ఉంది, బయట ఉంది, అంతటావ్యాపించి ఉంది. మనహృదయంలోఉన్న వస్తువు మనకు అనుభవంలోనికి వస్తే అంతటా ఉన్నది అదే అని మనకు తెలుస్తుంది. మనలోపలఉన్న దానిని అన్వేషించటం మానివేసి ఎక్కడో బయట అన్వేషిస్తే మనకు కాలం, శక్తి వృధాఅవుతుంది కాని ఏమీతెలియదు. ఈ ప్రపంచానికి యజమాని భగవంతుడు. ఆయన చెప్పిన ప్రకారం ఈప్రపంచం నడుస్తుంది కాని మనం చెప్పినట్లుగా నడవదు. అందుచేత ఈ ప్రపంచంలో జరిగే సంఘటనలకు మనం అప్‌సెట్ అవ్వకూడదు, వాటిని చూసి అశాంతి తెచ్చుకోవద్దు.

**ఈ సంచికలో......**

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**


| | | |
|---|---|---|
| 09-3-03 | పాలకొల్లు | 1 |
| 15-3-03 | ఆత్రేయపురం | 7 |
| 02-3-03 | యానాం | 11 |

మనం లేకపోతే ఇంటిలోనివారు ఏమైపోతారో అనుకొంటాము. ఏమీఅవ్వరు, మనఅహం భావన వలన అలా అనిపిస్తుంది. ఏది ఎప్పడు ఎలా జరగాలో అది అప్పడు అలా జరుగుతుంది. బాహ్యకారణాలవలన దుఃఖంరాదు. ఏదైతే లేదో అదిఉంది అనుకొంటున్నాము అక్కడ నుండి దుఃఖం ప్రారంభమవుతోంది. భగవంతుడి సంకల్పానికి భిన్నంగా ఆలోచించగలం, ఆయన సహకారంలేకుండా ఏదో సాధించగలం అనుకోవటం వలన అహంభావన పెరుగుతుంది. భగవంతుడి సంకల్పానికి భిన్నంగా ఏది జరుగదు.

నీకు సుఖం వచ్చినప్పడు పొంగిపోతే, దుఃఖం వచ్చినప్పడు కృంగిపోతే అహంభావన పెరిగిపోతుంది. ఈసుఖదుఃఖాలకు లోపలఉన్నసత్యానికి ఏమీ సంబంధంలేదు. సుఖంవచ్చినప్పడు పొంగిపోవటం వలన దుఃఖంవచ్చినప్పడు కృంగిపోవటం వలన నీవు కాని దేహంతోటి, మనస్సుతోటి, ప్రపంచంతోటి తాదాప్యం పెరిగిపోతుంది, అజ్ఞానంలో కూరుకొనిపోతావు. మనం సహకరించవలసినచోట సహకరించము, సహకరించకూడని చోట సహకరిస్తాము, దైవాన్ని పొందాలి అనే తలంపువస్తే సహకరించము, మంచి తలంపులు వస్తే సహకరించము, చెడుతలంపులు వస్తే సహకరిస్తాము, మనకు పునర్జన్మను తీసుకొని వచ్చే కోరికలకు, వాసనలకు సహకరిస్తాము, అందువలన అవిపెరిగిపోతున్నాయి, అది మనపరిస్థితి. నీహృదయంలో ఉన్నవస్తువును తెలుసుకోవటానికి నీవు ప్రత్యేకంగా ప్రయత్నం చేయనక్కరలేదు, నువ్వు దానిని గుర్తిస్తే సరిపోతుంది. నువ్వుదానిని గుర్తించకపోతే దానికిఏమీ నష్టం లేదు, నీకేనష్టం. కొంతమంది ఆసక్తి లేకుండా కష్టపడి పనిచేస్తారు, వచ్చేదిఏదో వస్తుంది, రానిదిఏదోరాదు. మనం ఏమి చేస్తాము అంటే వచ్చిన దానితో సంతృప్తిపడము, రానిదానికోసం ఎదురుచూస్తాము, చివరకు అశాంతి మిగులుతుంది. మనమనస్సులో వచ్చే క్షోభకు ఇదేకారణం. జీవితం పొడుగునా స్వంతబుద్ధిని కాపాడుకోవాలి. పరాయిబుద్ధి చాలా ప్రమాదం. ఎవడైనా ధనవంతుడు ఉంటే మీరుకూడా ధనవంతుడు అవ్వటానికి ప్రయత్నం చేయాలి కాని వాడు దరిద్రుడు అవ్వాలి అనుకోకూడదు. ఎవడైతే శాంతిలో ఉన్నాడో, ఎవడైతే బేధబుద్ధిలేకుండా ఉన్నాడో వాడి సన్నిధానంలో నీవు కూర్చొంటే వాడిమాటలతో పనిలేదు, నీమనస్సు పవిత్రమవుతుంది. నేను మీకు భౌతికంగా అపకారం చేయకపోయినా, మీకు అపకారం జరగాలి అని మనస్సులో అనుకొన్నా దోషమే. పూజ, జపం, ధ్యానంవలన మనలో ఉన్నదోషాలు నెమ్మదిగా పోతాయి అని చెపుతారు కాని మహర్షి సన్నిధిలో మనలో ఉన్న సమస్త దోషాలు ఒకేసారి పోతాయి. విష్ణురూపంలో, శివరూపంలో,





అల్లారూపంలో ఉన్నవాడు భగవంతుడే. మీరు బేధంపెట్టుకోవద్దు. భగవంతుడికి భిన్నంగా ఏదేవతలేదు. శివుడు కంటే విష్ణువు గొప్పఅని ఇలాదేవతల మధ్య బేధబుద్ధి పెట్టుకొంటే మనకు పురోగతిలేదు. మనశరీరాలు ఈభూమిమీదకు ఎందుకు వచ్చాయో, ఈశరీరం ద్వారా పొందవలసింది ఏమిటో అదిమనం మర్చిపోయాము. ఉన్నదేదోఉంది. అదినీకు దూరానలేదు, నీహృదయంలో అంతర్యామిగా ఉంది. అదినీకు తెలిసినా ఉంది, తెలియకపోయినా ఉంది, అది తెలిస్తే నీకు ఆనందం వ్యక్తమవుతుంది, అది తెలియకపోతే నీకు దుఃఖంవెంటాడుతుంది. సత్యసాక్షాత్కారం లేనివాడు ఎన్ని భోగాల మధ్యన ఉన్నా వాడిని దుఃఖంవెంటాడుతుంది. ఈశ్వరుని పాదాలను విడిచిపెట్టవద్దు. భగవంతునిపట్ల గౌరవం కలిగిఉంటే ఆయనదయ మనకు కలుగుతుంది. ఈశ్వరుని అర్చనచేయటం వలన మనలను రాగద్వేషములనుండి విడుదల చేస్తాడు. ఇప్పడు నీకు ఈదేహంతో, మనస్సుతో ఎలా తాదాప్యం ఉందో అలాగ నీహృదయంలో ఉన్న ఈశ్వరుడితో తాదాప్యం వచ్చినప్పడు, నీవు శాంతిలో ఉన్నప్పడు ఈసృష్టితో నీకు అతిసన్నిహితసంబంధం ఏర్పడుతుంది. జ్ఞానికి చైతన్యం తప్పించి ఏమీకనబడదు. ఒకవేళ కనబడినా అవి బొమ్మలు, నీడలు అని తెలుస్తూఉంటుంది. నీమనస్సులో ఏమిజరుగుతోందో జ్ఞానికి తెలుస్తూ ఉంటుంది. ఎందుచేతనంటే నీలోపల ఉన్నవాడు కూడా ఆయనే. మనం తలకాయలో జీవిస్తున్నాము, హృదయంలో జీవించటంలేదు. తలకాయలో జీవిస్తూఉంటే బేదబుద్ధి పెరుగుతుంది. హృదయంలో జీవించటం నేర్చుకున్నవాడికి అంతర్యామిగా ఉన్న వస్తువు గోచరిస్తుంది. హృదయంలోనికి వెళ్ళిచూస్తే మనందరము ఒకటిగానే ఉంటాము. గాఢనిద్రలో అందరూ ఒకటిగా ఉన్నారు. వ్యవహారంలోనికి వచ్చేసరికి వేరువేరుగా కనిపిస్తున్నారు. కొంతమంది ఎన్నిసంపదల మధ్యఉన్నా వైరాగ్యంలో ఉంటారు. ఏదైనావస్తే భగవంతుడే ఇచ్చాడు అనుకొంటారు, పోతే భగవంతుడే తీసుకొని పోయాడు అనుకొంటారు. మనస్సు అణిగినచోట నుండి మౌనం వస్తుంది. ఆమౌనంవాడికి ఉపయోగపడుతుంది, సమాజానికి ఉపయోగపడుతుంది. ఇతరులకు ఉపయోగపడాలి అని వాడు అనుకోడు, ఆఉపాధి ద్వారా ఇతరులకు సహాయసహకారములు అందుతాయి. చేసేవాడు ఈశ్వరుడే. జరిగేది అంతా ఈశ్వరసంకల్పం ప్రకారమే జరుగుతుంది. అదిమనకు అర్థంఅవ్వాలి. యుద్ధం జరగవలసి ఉంటే ఎంతమంది ఆపుచేయాలి అని ప్రయత్నంచేసినా యుద్ధంజరుగుతుంది. గురువు యొక్క సమక్షంలో మనస్సు అణుగుతుంది, మనస్సుకు శాంతి కలుగుతుంది, లోచూపుకలుగుతుంది. కొంతమందికి బాహ్యచూపేకాని లోచూపుఉండదు. లోచూపు

లేనివాడికి జ్ఞానం కలిగే అవకాశంలేదు. నిన్ను నీవు చూసుకొని లోకాన్ని చూడు. అప్పుడు లోకం నిన్నుబంధించదు. నిన్ను నీవు చూసుకోకుండా లోకాన్ని చూస్తే బంధింపబడతావు. మనం హృదయంలో ఉన్నవస్తువుకు ప్రాముఖ్యత ఇవ్వటంలేదు, దేహానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తున్నాము. నువ్వు 24 గంటలు దేహంచుట్టూ తిరుగుతూ ఉంటే ఇంక లోపలకు ఎప్పుడు వెడతావు. దేహం నేను కాకపోయినా, నాకు ఒకదేహం ఉంది. దాని ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవచ్చు అంతేగాని 24 గంటలు దేహం గొడవలో ఉంటూ, దేహాభిమానం పెంచుకొంటూ ఉంటేనీకు లోచూపు ఎలాకలుగుతుంది.

ఏతలంపు అయితే దేహంతో తాదాప్యం పొందుతోందో ఆతలంపు యొక్క మూలంలోనికి వెళ్ళగలిగితే నీకు భగవదనుభవం కలుగుతుంది. నీకు భగవదనుభవం కలుగకుండా నీవు జననమరణ చక్రంలోనుండి, దుఃఖసముద్రంలోనుండి బయటకు రాలేవు. శాంతి బజారులో కొనుక్కొనేదికాదు, నీహృదయంలో శాంతిఉంది. నీవు అక్కడకు వెళ్ళగలిగితే శాంతిసామ్రాజ్యానికి చక్రవర్తి అవుతావు. మీకు ఎన్నిసంపదలు ఉన్నా, పదవులు ఉన్నా శాంతిలేకపోతే ప్రయోజనంలేదు. ఏదోవస్తువును పట్టి ఇచ్చినట్లుగా గురువు దానిని నీకు పట్టి ఇవ్వడు. అదినీలోపల ఉంది, గురువునీకు మార్గాన్ని చూపిస్తాడు, నీప్రయాణానికి సహకారం అందిస్తాడు. నీవువెళ్ళటం అక్కడకు వెళ్ళవలసిందే. నీవు ఎన్ని పూజలుచేసినా, జపాలుచేసినా, ధ్యానాలుచేసినా లోపలనీకు సరియైన అవగాహన లేప్పడు నీవు దానిని పొందలేవు అని ఆచార్యులవారు చెప్పారు. ముందునీకు సబ్జక్టుపట్ల అవగాహన రావాలి, దేనితో తాదాప్యంపెంచుకోవాలి, దేనితో తాదాప్యం తగ్గించుకోవాలి అనే అవగాహన నీకు లేనప్పడు నీకు సత్యానుభవం కలుగదు. చేసే స్నేహాల విషయంలో, చదివేపుస్తకాలవిషయంలో బహుజాగ్రత్తగా ఉండండి, అజాగ్రత్తగా ఉంటే గమ్యాన్ని మిస్ అయిపోతారు, రాంగ్ తింకింగ్ వచ్చేస్తుంది. రాంగ్‌తింకింగ్ వలన రాంగ్ డైరెక్షన్‌లోనికి వెళ్ళిపోతారు. మనంకాని శరీరంతోటి, మనస్సుతోటి, లోకంతోటి తాదాప్యం పెట్టుకోవటంవలన మనం ఏదిగా ఉన్నామో దానితో తాదాప్యం రాదు, మనం దానిని పొందలేము. మనకు ఏది మంచిదో మనకంటే భగవంతుడికి బాగాతెలుసు. మీసంసారంలో మీకు ఇష్టంలేని సంఘటన జరిగింది అనుకోండి, కంగారుపడవద్దు. ఆఇష్టంలేని సంఘటనవలన పరిణామంలో మంచిజరగవచ్చు. మీరు ఏదైనా మాట్లాడేటప్పడు వివేకంతో మాట్లాడండి, మీరు మాట్లాడే మాట ఇతరులకు జ్ఞానం కలగటానికి సహకరించాలి కాని వారికి అజ్ఞానం తీసుకొనివచ్చేలా ఉండకూడదు. నీమనస్సు కల్పించే గొడవలు అన్నీ వదిలెయ్యి. మాయ అంతా మనస్సులోనేఉంది. ఎప్పడైతే నీవు మనస్సు కల్పించిన గొడవలు వదిలేసావో అప్పడు నీ బుద్ధికి స్థిరత్వం కలుగుతుంది, నీవు జ్ఞానంలోస్థిరపడతావు. కొంతమందికి ప్రతీ దానికి విసుగు. విసుగుఉన్నవాడు జీవితంలో ఏదీసాధించలేడు. మనబుద్ధికి ట్రైనింగ్ ఇవ్వాలి, దానికి ఓర్పు, లోచూపు నేర్పాలి. మహాత్ముల సమక్షంలో, భగవదనుభవం పొందినవాడి సమక్షంలో నీ వాసనలు అణిగిపోతాయి, మనస్సు నిర్మలం అవుతుంది, నిశ్చలమవుతుంది, అప్పడు సమాధి వచ్చి నిన్ను వరిస్తుంది. సమాధిస్థితిలో ఒక్కచైతన్యం తప్పించినీకు ఏమిగోచరించదు, ఎటుచూసినా చైతన్యమే, ఎటుచూసినా ఆనందమే. రాగంలోనుండి, భయంలోనుండి, కోపంలోనుండి విడుదల పొందటానికి నీవు చేస్తున్న ప్రయత్నం అది నీసాధనలో ఒకభాగం. మీకు భయకారణం ఉన్నా భయంలేకుండా ఉంటే, కోపకారణం ఉన్నా కోపం లేకుండా ఉంటేఈశ్వరుని దయ మీమీద వర్షిస్తుంది. మిమ్మల్ని అదృష్టం వెంటాడుతూ ఉన్నా ఈశ్వరుని పాదాలు విడిచిపెట్టవద్దు. ఈశ్వరుని పాదాలు నిజం మిగిలిన దంతా మిధ్య. మెరిసే దంతా బంగారం అనుకోవద్దు. గురువు అంటే బ్రహ్మమే ఆయననీతో మాట్లాడక పోయినా నీకు అంతర్‌దృష్టి కలుగచేస్తాడు, నీ వాసనాక్షయానికి సహాయసహకారములు అందిస్తాడు, నిన్ను హృదయగుహాలోఉన్న ఈశ్వరుని దగ్గరకు తీసుకొని వెళ్ళటవేకాదు, అక్కడ స్థిరంగా ఉండేటట్లుచేస్తాడు. నీమనస్సులో ఉన్నదోషములనుండి నిన్ను విడుదలచేసి నిన్ను హృదయగుహాలోఉన్నముక్తి స్థానం దగ్గరకు తీసుకొని వెళ్ళేవరకు, నీవు జీవన్ముక్తుడవు అయ్యేవరకు గురువునిన్ను విడిచిపెట్టడు. దేహంతో, లోకంతో, మనస్సుతో నీకు ఉన్న తాదాప్యం తగ్గించుకోవాలి. నీలోపల ఉన్న చైతన్యంతో తాదాప్యంపెంచుకోవాలి. దేహంతో, మనస్సుతో, లోకంతో ఉన్నతాదాప్యంపోతేనేను పరిమితుడనుకాదు, నేను అపరిమితుడను, నేను అంతటా ఉన్నాను అన్న సంగతినీకు అనుభవంలోనికి వస్తుంది, శాంతికి వారసుడవు అవుతావు, నిర్వాణసుఖాన్ని అందుకొంటావు. మీరు శాంతిగా ఉండటం నేర్చుకొంటే ప్రారబ్దం అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా మిమ్మల్ని ఏమీ చేయదు. నీ బంధువులు, స్నేహితులు,, కులాలు, మతాలు, రాగద్వేషాలు అన్నీమూలతలంపులో ఉన్నాయి. మూలతలంపు నశిస్తే నువ్వు ఏదిగా ఉన్నావో అదినీకు అనుభవంలోనికి వస్తుంది. మూలతలంపును ఎండింప చేయటమే తపస్సు. నీకు వచ్చే తలంపులు, నీవు మాట్లాడేమాట, నీవు చేసేపని అన్నికూడా మూలతలంపు నుండి విడుదల పొందటానికి నీకు సహకరించాలి, అలా నీజీవితవిధానాన్ని తీర్చిదిద్దుకోవాలి, అదే తపస్సు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 15-03-2003, ఆత్రేయపురం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఆందోళనగా ఉన్నవారు, ఆవేదనగా ఉన్నవారు, అశాంతిలో ఉన్నవారు మంచి పనులు చేయలేరు. శాంతిగా, నిర్మలంగా, నిశ్చలంగా ఉన్నవారు మాత్రమే మంచిపనులు చేయగలరు. మంచి మంచికోసమే చేయటం నేర్చుకోవాలి. సజ్జనసాంగత్యం విడిచిపెట్టవద్దు. హృదయంలోఉన్న సత్యవస్తువును అనుభవంలోనికి తెచ్చుకోవటానికి సత్పురుషులు సహకరిస్తారు. మనకు ధనం ఉందని భోగం పెంచుకోకూడదు ధనం ఇక్కడ ఆగిపోతుంది, భోగప్రవృత్తి వచ్చే జన్మకువస్తుంది. ప్రతీసంసారంలో అవసరంలేని ఖర్చులు పెంచుకొంటున్నారు, దానివలన చాలాప్రమాదం, జ్ఞానానికి దూరమవుతారు, భక్తికి దూరమవుతారు. మీకు ధనం ఉంటే మంచిపనులుచేయండి, పుణ్యం వస్తుంది. అంతేగాని మంచిపనులు చేస్తూ మనస్సును పెంచుకోవద్దు అని చెపుతున్నారు. మనస్సును పెంచుకోవటంవలన జ్ఞానానికి దూరమవుతారు. నీవు చేసే మంచిపనుల వలన మనస్సు పల్చబడితే అదిలోకానికి మంచిదే, దానివలన నీకు జ్ఞానం కలుగుతుంది. మనదైనందిన జీవితంలో ఎలా జీవిస్తే భగవదనుభవం కలుగుతుందో అలా జీవించటం నేర్చుకోవాలి, అదే జ్ఞానయజ్ఞం. భగవంతుడు మనహృదయంలో ఉన్నాడు. ఆయనలోపల ఉన్నాడు కాబట్టే మనం ఉన్నాము. ఆయన హృదయాన్ని కాళీచేస్తే ఈతుక్కును తీసుకొనివెళ్ళి స్మశానంలో పడవేస్తారు, ఈవిషయం కూడా మనకు తెలియటంలేదు. పూర్వజన్మలో మీరు చేసిన కర్మను బట్టి మీకు ఎప్పుడైనా దుఃఖంవస్తూఉంటుంది, సంతోషం వస్తూఉంటుంది. వీటిని పట్టించుకోవద్దు. వీటిని ఎక్కువగా పట్టించుకొంటే మనబుద్ధి మోహం అనే బురదలోనుండి బయటకు రాదు, వైరాగ్యంకలుగదు. వైరాగ్యం లేకపోతే జ్ఞానం కలుగదు అని భగవంతుడు చెపుతున్నాడు. మనకు జ్ఞానం కలుగకపోవటానికి మనస్వార్ధంకారణం. మీరు రోజుకు 4గంటలు ధ్యానం చేస్తారు అనుకోండి, స్వార్ధం కొంచంకూడా తగ్గలేదు అనుకోండి, ఇలా మీరు కోటిజన్మలు ఎత్తినా మీకు మోక్షంరాదు. త్యాగికానివాడు జ్ఞానికాలేడు. ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలంటే భయంతగ్గించుకోవాలి. మనం భగవంతుడిని ఉపాసనచేయాలి, ఆయన రూపాన్ని ధ్యానంచేయాలి. ఉపాసన చేయగాచేయగా ఆయన మనకు గోచరిస్తాడు. మనం జరిగిపోయిన గొడవలు తలపెట్టుకొంటూ, భవిష్యత్ గురించి గాలిమేడలు కట్టుకొంటూ ఇలా కాలక్షేపంచేస్తూఉంటే ఎప్పడో మరణంవస్తుంది, ఈజీవితం అంతా వృధాఅవుతుంది. పనిదగ్గర అశ్రద్ధగా ఉండవద్దు, మీపనిమీరు శ్రద్ధగా చేసుకొంటూ మిగతాటైములో భగవంతుడిని ధ్యానించగా, ధ్యానించగా, ఆయనకు ఇష్టమైన పనులు మనంచేస్తూ ఉంటే ఆయనచేతిలో ఉన్న జ్ఞానాన్ని మనకు ప్రసాదిస్తాడు. ఈశ్వరుడి యందు ప్రేమ, భక్తికలిగి ఉండాలి. భక్తివలన చిత్తశుద్ధికలుగుతుంది, ఏకాగ్రతకలుగుతుంది, ఇహపరాలను కూడా సాధించగలము. మీరు చేసే పనిశ్రద్ధగా చేస్తే, భగవంతుడు ఉన్నాడు అని పూర్తి విశ్వాసంతో చేస్తూఉంటే హృదయంలో ఉన్నఆనందం మీకు తెలుస్తుంది. సత్పురుషులతో సాంగత్యంచేయండి, దుస్సాంగత్యం చేయవద్దు అని ఆచార్యులవారు చెప్పారు. సత్పురుషుల సాంగత్యం ద్వితీయం ఎక్కడైతే లేదో అక్కడకు నిన్ను తీసుకొని పోతుంది అని చెప్పారు. శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకో. నీ అహంకారం రోజుకు పదిరకాలుగా మారుతూ ఉంటుంది. నీఅహంకారం చెప్పినట్లు నీవు వినటంకాదు, పరమేశ్వరుడు చెప్పినట్లుగా వింటే ఆయన స్వరూపాన్ని పొందుతావు.

మనకు పునర్జన్మ రావటానికి అహంకార, మమకారములేకారణం. మమకారం పోతే మనకు చిత్తశుద్ధి కలుగుతుంది, అహంకారంపోతే మనకు ఆత్మజ్ఞానం కలుగుతుంది అని చెప్పారు. ఈరెండు కారాలలో నుండి విడుదల పొందటానికే మనం చేసే సాధనలు అన్నీ పెద్దలు చెప్పిన మాటలు వింటున్నాము, శాస్త్రాన్ని అధ్యయనం చేస్తున్నాము నాకు దుఃఖం పోవటంలేదు, బాధపోవటంలేదు అని భగవాన్‌ను అడుగుతున్నారు. ఆత్మానుభవం కలిగే వరకూ ఏదోకొరత, ఏదోవెలితి, ఏదోఅశాంతి ప్రతీజీవుడిని వెంటాడుతూ ఉంటుంది. ధర్మాన్ని ఆచరిస్తూ, ధర్మాన్ని ఆధారంగా పెట్టుకొని జీవిస్తూ ఉంటే నీకు మోక్షంకలుగుతుంది కాని ధర్మాన్ని విడిచిపెట్టి నీ తెలివితేటల వలన మోక్షాన్ని పొందలేవు. మీరు భక్తిని సంపాదించుకొంటే, మీరుశాంతిస్థానంలో ఉంటే బాహ్యకారణాలవలన దుఃఖంవచ్చినా అవిఏమీ మిమ్మల్ని అంటుకోవు, మీరు శాంతిగా, ఆనందంగా ఉండగలరు. గాఢనిద్రలో నీకు దేహానికి సంబంధించిన, లోకానికి సంబంధించిన, మనస్సుకు సంబంధించిన చింతలేదు. అదే అసలుస్థితి. ఆస్థితినివదిలేసి జాగ్రదవస్థలోనికి రాగానే నేను అనే తలంపువచ్చింది, ఆతలంపును పట్టుకొని ఊరేగుతున్నావు. అసలును వదిలేసి అబద్ధాన్ని పట్టుకొని తిరుగుతున్నావు, ఎన్నిజన్మలు ఇలా తిరుగుతావు. నాకు దుఃఖం ఎప్పటివరకు ఉంటుంది అని అడిగితే దానికి భగవాన్ ఏమిచెపుతున్నారు అంటే తానొకవ్యక్తిని అనే భావన పోయేవరకు ఇది తప్పదు. నువ్వుదేహంతోటి, మనస్సుతోటి తాదాప్యం పొందినంతకాలం

నువ్వు ఒకదేశానికి అధిపతి అయినా నిన్ను దుఃఖం విడిచిపెట్టదు. లోకంలో మంచివారు ఉంటారు, చెడ్డవారు ఉంటారు. ఆగొడవవద్దు. మీరు ఎందుకు వచ్చారో ఆపనిచూసుకోండి. జ్ఞానాన్ని సముపార్జించు కోవటానికి భగవంతుడు ఈదేహాన్ని ఇచ్చాడు. వచ్చినపని మర్చిపోతే నువ్వేనష్టపోతావు. సుఖదుఃఖాలు, లాభనష్టాలు అన్నీ నీప్రారబ్దాన్ని బట్టివస్తాయి. నీకు లాభంవచ్చినా, నష్టంవచ్చినా అవి నీతెలివితేటలను బట్టిరావు, ప్రారబ్దాన్ని బట్టివస్తాయి. నీకుధనం వచ్చినా, సంతోషంవచ్చినా, దారిద్ర్యంవచ్చినా, దుఃఖంవచ్చినా అవిఏమీ నీవుకాదు, అవి నీప్రారబ్దాన్ని బట్టివస్తాయి. ఇదిమీకు బాగా అర్థమవ్వాలి, ఇది అర్థమయితే ఎప్పడూ మీరు ఆనందంగా ఉండవచ్చు. మీకు దారిద్ర్యం వచ్చింది అంటే దానిద్వారా నేర్చుకొనే పాఠాలు ఉన్నాయి, అందుచేత దారిద్ర్యంలో పెడుతున్నాడు. ఒకోసారి ధనవంతుడు పేదవాడు అవ్వవచ్చు, పేదవాడు ధనవంతుడు అవ్వవచ్చు. ఇదిఅంతా చూసేవారికి ఆశ్చర్యం అనిపించవచ్చు కాని భగవంతుడికి ఆశ్చర్యంగా ఉండదు ఎందుచేతనంటే ఇది అంతా వాడుచేసిన కర్మను బట్టి జరుగుతుంది. జీవుడు కర్మకు స్వాధీనం అయిఉంటాడు. నీకు ఏరకమైన దుఃఖంవచ్చినా అది నీవు పూర్వజన్మలో చేసిన దానినిబట్టి వస్తోంది. భగవంతుడు కర్మఫలదాత. నువ్వు చేసిన దానికి ఫలితం ఇస్తాడు, ఆవిషయంలో మటుకు అజాగ్రత్తగా ఉండడు. చేసినవాడు ప్రారబ్దాన్ని అనుభవిస్తున్నాడ, చేసినది అహంభావనే, అదే అనుభవిస్తోంది. చేసినది మీరు కాదు, అనుభవిస్తున్నది మీరుకాదు వాటిని ఒక ప్రక్కనపెట్టండి, మీరులోపలకు వెళ్ళిపోండి అంటున్నారు భగవాన్, పుట్టినవాడు చనిపోతాడు, చనిపోయినవాడు తిరిగి పుడతాడు. వీటిగొడవనీకు వద్దు. వీటితో తాదాప్యం వలన నీకు ఏదోఅయిపోతోంది అనుకొంటున్నావు. ఈశరీరం పుట్టుక ముందు నీవు ఉన్నావు, శరీరంవచ్చాక నవ్వు ఉన్నావు, శరీరం పోయాక కూడా నీవు ఉంటావు ఎందుచేతనంటే అదినీవుకాదు, ఇదితెల్సుకోవటానికి నీకు శరీరంవచ్చింది. ఈశరీరాన్ని, కాలాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకొని అది తెలుసుకో. అది తెలుసుకోకుండా నీవు ఎన్ని సాధించినా ఒకటిలేని సున్నలతోసమానము.

మీరు కర్మను చేయండి, కర్మనుయోగంగా చేయండి. కర్మయోగంవలన మీకు మోక్షంరావాలి అంతేగాని మీరు చేసే పనుల వలన పేరువచ్చింది అనుకోండి, ఆపేరును ఏమిచేసుకొంటారు. ఈలోకంఎంతనిజమో, ఈదేహం ఎంతనిజమో ఆపేరుకూడా అంతేనిజం. ఈసృష్టిఅంతా పరమేశ్వరుడిదే. ఏరూపంలో చూసినా, ఏనామంలో చూసినా అందరిలోను ఆయననే చూస్తూ, ఆయననే ఆరాధిస్తూ, నీవు ఏపనిచేస్తున్నా ఆయనను పూజిస్తున్నాను అనే భావనతో చేస్తే నీకు మోక్షం కలుగుతుంది. అంతేగాని నీవు చేసేకర్మనిన్ను బంధించకూడదు. నువ్వు చేసేపని నిన్ను అజ్ఞానంలోనుండి విడుదలచేయాలి అంతేగాని ఆపనివలన అజ్ఞానంలో కూరుకొనిపోకూడదు, దేహాన్ని కేంద్రంగా పెట్టుకొని జీవించటం వలన నీకుకోరికలు, తలంపులు వస్తున్నాయి. మీకు ఏతలంపు వచ్చినా దానికి దేహము నేను అనే తలంపు కారణం అవుతుంది, మీరు ప్రశాంతంగా కూర్చొని ఆలోచించుకొంటే అది మీకు తెలుస్తుంది. దేహమునేను అనేబుద్ధిని ఛేధించటమే సాధనయొక్క ప్రయోజనం. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటేనీకు ఏదైనా బాధవచ్చింది అనుకో, అదినిజం అనుకోవద్దు, అదికూడా ఒకతలంపు మాత్రమే. ఆబాధ నిజమయితే నీ గాఢనిద్రలో ఆబాధ ఎక్కడికి వెళ్ళిపోతోంది. తలంపువచ్చినప్పడు బాధవస్తోంది, తలంపులేనప్పడు బాధలేదు గాఢనిద్రలో నీవు శరీరరహితుడవు, మనస్సురహితుడవు, లోకరహితుడవు. ఆస్థితిని నీవుజాగ్రదవస్థలో తెచ్చుకోవాలి. అప్పడునీకు బాధలేదు, దుఃఖంలేదు, పునర్జన్మలేదు. మీకు మంచి మంచి ఆలోచనలు, తలంపులు వస్తున్నాయి అనుకోండి, అవికూడా సంపదతోసమానము. జ్ఞానసూర్యుడు మీహృదయంలోనే ఉన్నాడు. మీరు ఎన్నియాత్రలు చేసినా, ఎన్నినదులలో స్నానాలు చేసినా, ఎంతమంది దేవతలను దర్శించినా చివరకు హృదయం దగ్గరకు రావలసిందే, నిర్వాణసుఖం పొందాలంటే చివరకు హృదయం దగ్గరకు రావలసిందే, ఇక్కడఉన్న చైతన్యాన్ని దర్శించాక మొత్తం లోకం అంతా కూడాచైతన్యం గానే కనబడుతుంది. నిన్ను నీవు చూసుకొని లోకాన్ని చూస్తే లోకంనిన్ను బంధించదు. పరమేశ్వరుడు అన్ని కాలాలలో ఉన్నాడు, అంతటావ్యాపించి ఉన్నాడు, కాని మనం పరిమితులు పెట్టుకొంటున్నాము. అందువలన మనకు దుఃఖంవస్తోంది. భేదబుద్దివలన, రాంగ్‌తింకింగ్ వలన మనకు దుఃఖం వస్తోంది. మీరు చేస్తున్నపని శ్రద్దగా, ఇష్టంగా, ప్రేమగాచేస్తే కర్మకు అతీతమైన స్థితికి తీసుకొనివెళతాడు. చేసేపని అశ్రద్ధగా, అయిష్టంగా చేస్తారు అనుకోండి రాబోయే జన్మలో మరల ఆపనే అప్పగించి మొట్టికాయలు మొట్టి మీచేత చేయిస్తాడు. సత్పురుషుల సహవాసం వలన మీరు కాలాన్ని జయిస్తారు, కోరికను జయిస్తారు. ఈకోరికలను, కాలాన్ని దాటివెళ్లిపోతారు అది సత్పురుషులయొక్క వైభవం అని ఆచార్యులవారు చెప్పారు. మాకు మోక్షంరాదు అని అనుకోవద్దు, ఆతలంపు మీకు అడ్డుపడుతుంది. ఆత్మవిశ్వాసాన్ని ఎప్పడూ పోగొట్టుకోవద్దు. ఆత్మవిశ్వాసంవలన మీరు

బాగుపడతారు. సముద్రంలో ఎంతనీరు ఉందో నీహృదయంలో అంత ఆనందం ఉంది అదినీకు అందకపోవటానికి ఒక్కటే అడ్డు. నీవుకాని దేహాన్ని, నీవుకాని మనస్సును నీవు అనుకోవటం వలన లోపలఉన్న ఆనందం నీకు అందటంలేదు. దానిని ఛేధించటమే జ్ఞానం. దేహమే నేను అనే తలంపువలన, మూలతలంపువలన నీకు హృదయంలో ఉన్న ఆనందం అందటంలేదు. నీవు ఏమార్గంలో ప్రయాణం చేసినా, ఏరకంగా సాధన చేసినా ఈమూలతంపును ఛేధించటమే నీసాధన యొక్కగమ్యం. మీరు ఏరూపాన్ని చూసినా అన్ని వస్తువులలో, అన్ని పేర్లలో భగవంతుడినే చూడటం నేర్చుకోండి. ఇలా చూడటం నేర్చుకొంటే హెచ్చుతగ్గులు, రాగద్వేషాలు పోతాయి. మనం చేసినదే మనకు ఎదురువస్తుంది. గాని మనం చేయనది మనకు ఎదురురాదు. ఎవరిప్రారబ్దంలోఏది ఉంటే అదే వస్తుంది. ఆగొడవలు వదలిపెట్టి మీరు బాగుపడటానికి ప్రయత్నం చేసుకోండి. అక్కడ నుయ్యి తవ్వించాను అంటే మంచిదే చేయండికాని మీరు సాధనచేసి మీరు శాంతిగా, పవిత్రంగా, ఆనందంగా ఉండగలిగితే మీద్వారా ఇతరులకు సహాయం అందుతుంది, వారు బాగుపడతారు, దేశం బాగుపడుతుంది. భక్తికి ఉన్నశక్తిదేనికిలేదు, భక్తిలోనుండే శక్తివస్తుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 02-03-2003, యానాం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

జ్ఞానసముపార్జనకు భగవంతుడు మనకు కొన్ని అవకాశములు ఇస్తున్నాడు. కాని మనం వాటిని సద్వినియోగం చేసుకోవటంలేదు, దుర్వినియోగం చేస్తున్నాము. మన జీవితయాత్ర నడవటంకోసం ఎవరివృత్తివారు చేసుకొంటూ ఆత్మజ్ఞానసముపార్జన చేసుకోమని భగవంతుడు చెపుతున్నాడు. పని కూడా దేవుడితో సమానము. భగవంతుడు మీకు కేటాయించిన పనిని శ్రద్దగా చేసుకొంటూ, పనిలో దేవుడిని చూడటం నేర్చుకొంటే మనకు దైవానుగ్రహం కలుగుతుంది. మనం ఏదైనా ఒక సబ్జక్టు విన్నప్పుడు దానిని లోతుగా విశ్లేషణ చేయాలి, దానిని సొంతం చేసుకోకపోతే అది మీకు ఉపయోగపడదు. మనం గాఢనిద్రలో శరీరంలేకుండా, మనస్సులేకుండా ఉన్నాము, అక్కడ సుఖంగా ఉన్నాము, శాంతిగా ఉన్నాము. ఇది మీఅనుభవానికి సరిపోతోందో, లేదో చూసుకోండి. జాగ్రదవస్థ వచ్చేటప్పటికి మొదట నేను అనే తలంపు వస్తోంది. మనం దానితో కలిసిపోతున్నాము. ఇదే మొదటి తప్ప. ఆమొదటిపొరపాటులో నుండి చాలా పొరపాట్లు చేస్తున్నాము. బంతి





జారాలిగాని ఎక్కడకు వెళ్ళిపోతుందో చెప్పలేము అలాగే మనిషి పతనం అవ్వటం ప్రారంభిస్తే ఎంతవరకు వెళతాడో చెప్పలేము. మనందరం చేసే పొరపాటు ఏమిటి అంటే మన అస్తిత్వాన్ని శరీరానికి, మనస్సుకు కుదించేసుకొంటున్నాము. నేను అంటే శరీరం అనుకొంటున్నాము. దేహము నేను అనేతలంపు వచ్చేటప్పటికి మనకు దుఃఖం వస్తుంది. ఇది మన అనుభవంలో తెలుస్తోంది. మనంకానిదానిని మనం అనుకోవటం వలననే డిజైర్ ప్రారంభమవుతోంది, ఎటాచ్‌మెంట్ ప్రారంభమవుతోంది, వీటివలన మనకు దుఃఖంవస్తోంది. మీరు సాధన చేయాలంటే దేహాన్ని, మనస్సును ఆరోగ్యంగా చూసుకోవాలి. మనకు వచ్చేతలంపులను తగ్గించుకోవాలి, మాటలు తగ్గించుకోవాలి, అతిగా తినకూడదు, అతిగా నిద్రపోకూడదు. అతినిద్రవలనభౌతికఅభివృద్ధి, ఆధ్యాత్మికఅభివృద్ధి ఆగిపోతుంది. అవసరమైనప్పుడు మాట్లాడాలి, అహంభావన కోసం మాట్లాడకూడదు. మనకు తెలియనది తెలియదు అని చెప్పాలి కాని తెలిసినట్లు నటించకూడదు. మీరు ఏగుడిలోనికి వెళ్ళినా మోక్షం తప్పించి ఏమీఅడగవద్దు. మీరు మోక్షం అడిగితే మోక్షం ఇచ్చి మిగతా విషయాలు కూడా ఇస్తాడు. అడగకపోతే ఇవ్వడేమో అనుకొని మనం తొందరపడి అడుగుతాము. మనం లోకానికి సంబంధించిన విషయాలు అడుగుతాము. తాత్కాలిక ప్రయోజనాలకు, ఆకర్షణలకు లోబడిపోతున్నాము. అసలు మనకు ఏదిమంచిదో మనకు తెలియటంలేదు. మీరు ఇక్కడకు వచ్చినా, నేను ఇక్కడకు వచ్చినా మన తెలివితేటలవలన రాలేదు, భగవంతుడి సంకల్పాన్ని బట్టి మనం ఇక్కడకు వచ్చాము. ఒకోవిషయాన్ని మనం జ్ఞాపకంపెట్టుకొందామనుకొన్నా మర్చిపోతాము ఒకోవిషయం మరుపువస్తే బాగుండును అని మనం అనుకొంటే అదే మరల మరల జ్ఞాపకం వస్తుంది. నీకర్మానుసారాన్ని బట్టి ఆమరుపును, జ్ఞాపకాన్ని తీసుకొనివచ్చే వాడిని నేనే అని భగవంతుడు చెపుతున్నాడు. God is everything, I am nothing ఈసూత్రం మీరు గుర్తుంచుకొంటే ఈక్షణంలో మీదుఃఖం చల్లారిపోతుంది. మనం ఉద్రేకాన్ని పెంచుకోవటంకాదు., ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలి. ఉద్రేకం వలన ఇంతవరకు ఎవరూ బాగుపడలేదు, మనమీద మనం విశ్వాసం పెంచుకోవాలి. కొంతమందికి ఏమీ కారణం లేకుండా విసుగుదలవస్తుంది. ఆవిసుగుదలఉన్న మనుషులకు జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది, గ్రహించేశక్తి తగ్గిపోతుంది, తోటిమానవులతో ఇష్టంగా, ప్రేమగా జీవించే అలవాటు తగ్గిపోతుంది. కుటుంబసభ్యులపట్ల మీడ్యూటీ మీరు చెయ్యండి అంతేగాని వారిమీద మోహంపెట్టుకోవద్దు. మీ దేహానికి ఎలా ప్రారబ్దం ఉందో, మీ ఇంటిలోని వారి

దేహాలకు కూడా అలా ప్రారబ్దం ఉంది. మనిషిని, మనిషిని దూరం చేసేది అహంభావన. మనం ఏపని మీద ఈభూమి మీదకు వచ్చామో ఆపనిని జ్ఞాపకం చేయటానికే ఈ ప్రవచనాలు.

నాకు మోక్షం ఎప్పుడు వస్తుంది అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. నీవుపుట్టాను అనుకొంటున్నావా? పుట్టలేదు అనుకొంటున్నావా? అనిఅడిగారు. నేను పుట్టాను కదా అన్నాడు. నువ్వు పుట్టాను అనుకొంటే నీకు మోక్షంరాదు అన్నారు. పుట్టినది చనిపోతుంది, చనిపోయినది పుడుతుంది. ఏవస్తువుకయితే పుట్టుకలేదో ఆవస్తువు నీవైఉన్నావు. ఆపుట్టినది మటుకు నీవుకాదు, పుట్టనివస్తువుఏదో అది నీకు తెలియటంలేదు, అది నీ హృదయంలోనే ఉంది. ఇప్పుడు నీకు శరీరం నేనుగా ఎలావ్యక్తమవుతోందో, నీహృదయంలో ఉన్న పుట్టనివస్తువు నీకు నేనుగా వ్యక్తమయినప్పుడు నీకు మోక్షం కలుగుతుంది, అప్పటివరకు నీకు మోక్షంరాదు. భగవాన్ మతాల గురించి చెప్పలేదు, మధ్యవర్తులతో సంబంధంలేకుండా, మతాలతో సంబంధం లేకుండా నీహృదయంలో ఉన్న ఆనందంలోనికి, శాంతిలోనికి నిన్ను తీసుకొనివెళ్ళి అక్కడ ముంచటానికి ప్రయత్నం చేసారు. ఈలోకానికి ఒకప్రభువు ఉన్నాడు, ఈశ్వరుడున్నాడు అని నోటితో చెపుతున్నాము కాని హృదయంలో నమ్మటంలేదు. మననోటికి, హృదయానికి ఎంతదూరమో? నీహృదయంలో ఉన్న సుఖంనీకు అనుభవంలోనికి రాకుండా ఏవైతే అడ్డువస్తున్నాయో తెలుసుకొని వాటిని బయటకులాగి కాల్చిబూడిదచెయ్యి అన్నారు భగవాన్. గాఢనిద్రలో మనం దేహరహితంగా, మనోరహితంగా ఉన్నాము. ఇప్పుడు కూడా మనం దేహరహితంగా, మనోరహితంగా ఉంటే ఎటుచూసినా మనకు ఆనందమే. సూర్యుడికి చీకటి ఏవిధంగా అయితే కనబడదో దేహరహితంగా, మనోరహితంగా ఉన్నవాడికి ఎక్కడికి వెళ్ళినా దుఃఖం కనబడదు. నీకు నేనుఅనే తలంపుఉంది కదా. ఆతలంపును చూసి పారిపోకుండా దానిని డైరెక్టుగా పేస్‌చేసి దానిని తొలగించుకొంటే నీకు భగవదనుభవం కలుగుతుంది. దేవుడు లేనిచోటు అంటూలేదు, దేవుడులేనికాలం అంటూలేదు. ఒకప్రాంతంలో ఉండి ఇంకోప్రాంతంలో లేకపోతే, ఒకకాలంలో ఉండి ఇంకోకాలంలో లేకపోతే ఆయన దేవుడేకాదు. భగవంతుడు అంతటా వ్యాపించి ఉన్నాడు, అంతేకాదు ఈ ప్రకృతికి, జీవకోటికి సాక్షిగాఉండిమన దేహప్రారబ్దాన్ని అనుసరించి మనలను నడిపిస్తున్నాడు. ఏమనిషికి పొరపాటు చేయాలని ఉండదు, కాని పొరపాట్లు ఎందుకు చేస్తున్నాడు అని అడిగితే వాడు పొరపాటు చెయ్యాలని





చేయటంకాదు, కోరికవలన చేస్తున్నాడు అని భగవంతుడు చెప్పాడు. ఆకోరిక ఎక్కడనుండి వస్తోంది? దేహాన్ని ఆత్మఅనుకోవటం వలన, తానుకానిదానిని తానుఅనుకోవటం వలన కోరిక వస్తోంది అని చెప్పాడు. డబ్బు మంచిదికాదు చెడ్డదికాదు, కాలం మంచిదికాదు చెడ్డదికాదు వాటిని మనం సద్వినియోగం చేసుకొంటే పుణ్యం, దుర్వినియోగం చేసుకొంటే పాపం వస్తాయి. వాటిని మనం ఉపయోగించుకోవటాన్ని బట్టి ఉంటుంది. భగవంతుడు కాలరూపంలో ఉన్నాడు. మీకు ఎప్పుడైనా దుఃఖంవస్తే మనుషులు పరిష్కారం చేయలేకపోయిన కాలం పరిష్కారం చేస్తుంది. మీకు ఒకమంచిభావం వచ్చిందిఅనుకోండి, దానిని మీరు పదిమందికి చెప్పారు అనుకోండి, వారికి అర్ధంకాకపోయినా మీరు కంగారుపడవద్దు, కొంతకాలం తరువాత పుట్టబోయే జీవులు అర్థంచేసుకొంటారు. మిధ్యానేనుకు శిలువ వేయండి మీకు జ్ఞానం కలుగుతుంది అంటారు భగవాన్. మిధ్యానేనుకు శిలువ వేస్తే అది నశిస్తుంది, వాస్తవంనీకు ఎఱుకపడుతుంది. అందుచేత మిధ్యానేనుకు శిలువవేసే ప్రయత్నంలో ఉండండి, అదేసాధన. దుఃఖంకారణం బయటలేదు, నీలోపలే ఉంది. ఈక్లూ మీకు అర్థమయితే బయటివారు పొగిడినా మీకు ఏమీ అనిపించదు, విమర్శించినా మీకు ఏమీ అనిపించదు. బయటివారి మాటలు పట్టుకొని బ్రతకవద్దు. మనకళ్ళతో మనం చూసుకోవాలి, మనబుద్దితో మనం ఆలోచించుకోవాలి. మనిషికి అసూయ తొందరగా వస్తుంది, వారు అసూయతో మాట్లాడే మాటలు బుజానవేసుకొని తిరగవద్దు. దేహగతమైన నేను విజృంబిస్తూ ఉంటే దేహవాసన, లోకవాసన, శాస్త్రవాసన పెరిగిపోతూ ఉంటాయి. మీరు ఏపని చేసిన భగవంతుడి ప్రీత్యర్థం చేయండి. కొంతమంది మంచిపనులు చేసివారిని వారు కీర్తించుకొంటూఉంటారు, దాని వలన పుణ్యఫలం నశిస్తుంది అని శాస్త్రంచెపుతోంది. ప్రతీమానవుడు వాడినివాడు పొగడుకొంటూ ఉంటాడు, ఇతరులను నిందిస్తూ ఉంటాడు. వీటివలన దేహాభిమానం పెరుగుతుంది. మనం ఏనేనును అయితే తొలగించుకోవాలనుకొంటున్నామో ఆనేను పెరిగిపోతూ ఉంటుంది. దేహగతమైన నేనుకు వెళ్ళే ఆహారాన్ని కట్‌చేయాలి, అదేసాధన. తానుకానిదానితో తాదాప్యం పొందటం వలన మానవుడు పొరపాట్లు చేస్తున్నాడుకాని అలా తాదాప్యం పొందకపోతే వాడు పొరపాటు చెయ్యనే చేయడు, చేయవలసిన పనికూడా వాడికి లేదు. నిజమైననేను మీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు దాని తాలుక సుఖం, శాంతి, ఆనందం మీకు లోపల తెలుస్తూ ఉంటుంది. మీకు వందకోట్లు నిల్వఉంది అనుకోండి, మీకు కోటిరూపాయలు అప్పఉంది అని లోకం చెప్పకొంటే మీకు నష్టంఏమిటి? మీరు శాంతిలో స్థిరపడ్డారు అనుకోండి,

మీలోపలఉన్న ఆనందసముద్రంపొంగి మీ సహస్రారాన్ని ముంచుతూ ఉంటే ఇతరులు మీరు దుఃఖంలో ఉన్నారు అంటే మీకు వచ్చే నష్టం ఏముంది. నిజంగా మనం సుఖంగా లేముఅనుకోండి మనం సుఖంగా ఉన్నాము అని ఎదుటివారు అనుకోవటం వలన మనకు వచ్చేలాభంలేదు. నీహృదయంలో ఉన్న సత్యం నీకు అనుభవంలోనికి రాకుండా నీబంధువులుగాని, నీ స్నేహితులుగాని, నీ పరిసరాలు గాని ఎవరూ అడ్డురావటంలేదు, నీలోపలఉన్న నకిలీనేను అడ్డువస్తోంది, దానిని శిలువ వేయండి సరిపోతుంది అని చెపుతున్నారు. ఈమిధ్యానేనును, నకిలీనేనును నీవు పోవాలి పోవాలి అంటే అదిపోదు అది ఎక్కడ ఉదయించి వస్తోందో చూడాలి అది ఎక్కడనుండి వస్తోందో మనకు తెలియదు, అది ఉందని తెలుస్తోంది. ఈ మిధ్యానేనును, మూలతలంపును పట్టుకొని అది ఎక్కడనుండి వస్తోందో అక్కడకు తోలుకొని వెళ్ళగలిగితే అది దానిమూలాన్ని చూసినవెంటనే నశిస్తుంది. అది నశించినప్పడు నువ్వు నశించవు ఎందుచేతనంటే అది నవ్వు కాదు. ఈమూలతలంపు నశించటం, నీహృదయంలోఉన్న నారాయణుడు తానుగా వ్యక్తమవ్వటం ఒకే కాలంలో జరుగుతుంది. మూలతలంపు మూలంలోనికి వెళ్ళటానికి సత్పురుషుల సహవాసం, గురువు అనుగ్రహం అవసరం. మీ అనుగ్రహం కావాలి అని ఎవరైనా భగవాన్‌ను అడిగితే ఈశ్వరానుగ్రహం ఉంటే నాఅనుగ్రహం ఉన్నట్లే అనేవారు. ఈశ్వరుడు, గురువు, ఆత్మవేరుకాదు. అనేక జన్మలు భగవంతుడిని ఆరాధించగా ఆరాధించగా, పూజించగా పూజించగా భగవంతుడే కాళ్ళు చేతులు తొడుక్కొని ఈభూమి మీదకు వస్తాడు, వాడే గురువు. పూర్వజన్మలలో ఎంతోకొంత సత్కర్మచేయకపోతే సత్పురుషులతో, సహృదయం ఉన్నవారితో సహవాసంచేయాలనే బుద్దికూడా మనకు కలుగదు. ఈశ్వరుని స్మరించటం, ధ్యానించటం, సత్పురుషులతో సహవాసం, సద్గ్రంధాలను అధ్యయనం చేయటం వీటివలన మన మనస్సు పవిత్రమవుతుంది. నువ్వు బయటకు చూచే బదులు లోపలకు చూడు, నీమొఖాన్ని మూలతలంపు మూలంలోనికి త్రిప్పు. బయటఉన్నదంతా దుమ్ము, లోపల బంగారపు ఘనిఉంది. అందువలన నీమొఖాన్ని లోపలకు త్రిప్పు మనలో ఏది ఉంటే అదే బయటకనబడుతుంది. జ్ఞానికి అంతా జ్ఞానమే, అంతా సుఖమే, అంతా శాంతే. నీలోపలశాంతి ఉంటే లోకం అంతా శాంతిగానే కనబడుతుంది. అదృష్టం, దురదృష్టం, కష్టసుఖాలు ఇవిఅన్నీ దేహప్రారబ్దానికి సంబంధించినవి, నీలోపలఉన్నసత్యానికి వీటికి ఏమీ సంబంధంలేదు. అసలు మనకు జ్ఞానసముపార్జన పట్ల ఆసక్తిలేదు. ఎప్పడు సుఖపడతాము,





ఎప్పడు సుఖపడతాము అని కనిపెట్టుకొని ఉండటం. మీమనస్సు బయటకు వెళితే సుఖంరాదు, లోపలకు వెళ్ళితే సుఖం వస్తుంది. మనస్సు బాహ్యముఖానికి వెళితే అజ్ఞానం పెరుగుతుంది, మనస్సు అంతర్ముఖమయితే జ్ఞానం కలుగుతుంది. నీమనస్సు ఎటువెళుతోందో చూసుకో. సంస్కరింపబడిన మనస్సు గాని గమ్యం వైపుకు ప్రయాణం చేయదు. దైనందిన జీవితంలో మన ప్రవర్తన, మనమాట, మనచేత, మనకు వచ్చే తలంపులు మూలతలంపు మూలంలోనికి వెళ్ళటానికి ఎంతవరకు సహకరిస్తున్నాయో చూసుకోండి, అవి సహకరిస్తూ ఉంటే వాటి సహకారం తీసుకోండి. ఆమూలతలంపును తొలగించుకోవటం అనేది నీ సొంతసమస్య, దానిని ఎవరో వచ్చి పరిష్కారం చేస్తారని ఎదురుచూడవద్దు. దానిని పరిష్కరించుకోవటానికి నవ్వు ప్రయత్నం చేస్తూఉంటే గురువు సహాయం వస్తుంది. మనంబాగుపడటానికి ప్రయత్నంచేస్తూ ఉంటే భగవంతుడు ఎవరో ఒకరి ద్వారా మనకు సహాయం అందిస్తాడు. దేహాభిమానం తగ్గించుకోవటానికి మీరు సిన్సియర్‌గా సాధన చేస్తున్నారు అనుకోండి ఈశ్వరుడు గురువును మీగుమ్మంలోనికి పంపిస్తాడు. మనకుకోరికలేకపోతే, తలంపులేకపోతే ఆపని అవ్వదు అనుకొంటాము. దేహప్రారబ్దంలో ఉన్నది ఏదోవస్తుంది, లేనిదిరాదు. మనకోరికకు శక్తిలేదు, శక్తి ఈశ్వరుడిది. ప్రారబ్దంలో ఏది ఉంటే అది వస్తుంది, వచ్చిన దానిని కాళ్ళతో తన్నవద్దు, రానిదానికోసం ఎదురుచూడవద్దు, ఇదిమనం జీవితంలో నేర్చుకోవాలి, మనం ఇప్పడు మిధ్యానేనుతో పోరాడుతున్నాము. దానిబలం ఎక్కువైతే మనం కూలిపోతాము, మనకు వివేకబలం ఎక్కువగా ఉంటే, విచక్షణాబలం ఎక్కువగా ఉంటే అది పడిపోతుంది. గాఢనిద్రలోనుండి జాగ్రదవస్థలోనికి రాగానే మొదట నేను అనే తలంపు వస్తుంది. ఆతలంపువచ్చాక మిగతా తలంపులు వస్తున్నాయి. ముందు ఏతలంపువస్తోందో దానిని ఎందుకు పరిష్కారం చేసుకోవు అని భగవాన్ అడుగుతున్నారు. కాని మనం ఆతలంపును పరిష్కారం చేసుకోవటంలేదు, ఇదేమాయ ఆమూలతలంపుకు శిలువవెయ్యండి అంటున్నారు భగవాన్, ఇది రమణబోధ.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 3 టు 8-4-03 | | శ్రీ నాన్నగారు అరుణాచలంలో ఉందురు |
| 11-04-03 | శుక్రవారం | పాలకోడేరు రామాలయం శ్రీరామనవమి మహోత్సవం |
| 13-04-03 | ఆదివారం | భీమవరం డి.ఎన్.ఆర్ కాలేజి రామకృష్ణ ప్రార్ధనా మందిరం శ్రీఉద్దరాజు ఆనందరాజు గారి వర్ధంతి సందర్భముగా |
| 15-04-03 | మంగళవారం | తాడేపల్లిగూడెం, స్వామి అయప్ప దేవాలయం |
| 16-04-03 | బుధవారం | భీమవరం తాడిమళ్ల వారి కేంద్రం |

## ఆత్మానందము

మనము ప్రతి ఒక్కరము శాశ్వతమైన శాంతిని, ఆనందాన్ని కోరుకుంటూ వుంటాము, దానికి కారణం మన స్వరూపమే పరమఆనందం, పరమశాంతి. 'పరమశాంతి' అనగా దేహ ఇంద్రియ మనోబుద్ధులకు అతీతమైనది. సుఖదుఃఖాలను రెండింటిని అతిక్రమించిన స్థితి. పరమశాంతి స్వరూపంగా మన హృదయంలో ఉండగా దానిని గురించి బాహ్యవిషయాలలో వెదకుటయే మనము చేయు పొరపాటు. ఇంద్రియాలద్వారా, విషయాలద్వారా మనము శాంతిని పొందాలను కుంటున్నాము. బాహ్యవిషయాలలో ఆనందం గురించి వెదకటం వల్లనే నిజమైన ఆనందానికి మనము దూరమవుతున్నాము, అది మొసలి వీపుమీద కూర్చొని నదిని దాటుట లాంటిది. ఇంద్రియాలద్వారా పొందే శాంతి, ఆనందం స్వతంత్రమైనది కాదు, అది సాపేక్షమైనది కాని జ్ఞాని అనుభవించే శాంతి స్వతంత్రమైనది, ఇంద్రియాలకు అతీతమైనది, ఆది మధ్యాంత రహితమైనది.

వివేక, వైరాగ్యములతో కూడిన పరిపూర్ణ శరణాగతి లేదా విచారణ ద్వారా స్వరూపం అనుభవంలోనికి వస్తే మనము సచ్చిదానందస్వరూపుల మవుతాము, ఆత్మానందాన్ని పొందుతాము. మనస్సు దాని మూలంలో తన ఉనికిని కోల్పోయినప్పుడు శాంతి స్వరూపంగా వ్యక్తమౌతుంది. దేహతాదాప్యం వదిలేస్తే ఉన్నదే పరమశాంతి. మన స్వరూపమే ఆనందం అయినప్పటికి అది అనుభవంలోకి రాకుండా మన అహంకారమే అడ్డువస్తోంది. "నేను-ఇది", "నేను-అది" అని తలుస్తాము అదే పరిమితబుద్ధి. మనస్సును సంస్కరించుకొని పరిమితబుద్ధినుండి విడుదల పొందుటయే సాధన గమ్యం. మనము పొందవలసింది నిత్యనిరతిశయానందాన్ని. అది వస్తువులలోనూ, వస్తు సంయోగంలోనూ లేదు, అది కేవలం ఆత్మస్వరూపం, అదే మనసహజస్థితి, మన నిజస్థితి.

**చావలి సూర్యనారాయణ మూర్తి**, అమలాపురం



సద్గురు శ్రీ నాన్నగారు మరియు సైమట్ ల్యాబ్స్ అధిపతి శ్రీ సుబ్బారావుగారు.

ది. 7-3-2003న భీమవరం ఇండియన్ బ్యాంకురోడ్‌లో సైమట్ ల్యాబ్స్ కంపెనీ వారు అమృత మెడికల్ ఏజన్సీస్ అను పేరుతో ఏర్పాటుచేసిన సేల్స్ కౌంటర్‌ను సద్గురు శ్రీ నాన్నగారు ప్రారంభోత్సవం గావించినారు.





ది.23-3-2003 ఆదివారం వైజాగ్ సీతమ్మధారలో శ్రీరమణ క్షేత్రం అధ్యక్షులు శ్రీ పి.ఎస్.ఎన్.రాజు గారి **మురళీభవన్** గృహప్రవేశ సందర్భంలో సద్గురు శ్రీ నాన్నగారు